Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143




Associate Editor: K L KRISHNAM RAJU | Volume: 6 | Issue : 129 | Tuesday 22.04.2025 | Price : Rs.3/- | Pages : 4

అసోసియేట్ ఎడిటర్ కే ఎల్ కృష్ణంరాజు | సంపుటి: 6 | సంచిక : 129 | మంగళవారం 22. 04. 2025 | వెల : రూ.3/- | పేజీలు 4

## నేడు సిట్ విచారణకు... హాజరవుతున్నా... : రాజ్ కసిరెడ్డి

నేడు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య సిట్ కార్యాలయానికి వస్తానని వెల్లడి



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : ఏపీ మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి అలియాస్ రాజ్ కసిరెడ్డి, ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణకు హాజరు కావాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఆయన నేడు ఓ ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య సిట్ అధికారుల ముందు విచారణకు హాజరవుతానని వెల్లడించారు అంతకుముందు, ఇదే కేసులో ముందస్తు బెయిల్ కోసం రాజ్ కసిరెడ్డి హైకోర్టును ఆశ్రయించిన మిగతా 2 లో

## భారతీయుల పట్ల ఆయనకున్న ప్రేమ ఎల్లప్పుడూ... గుర్తుండిపోతుంది..

### పోప్ మృతికి ప్రధాని సంతాపం



న్యూఢిల్లీ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : క్యాథలిక్ మతపెద్ద పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూసిన విషయం తెలిసిందే. ఇవాళ ఉదయం వాటికన్ సిటీలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. ఈ విషయాన్ని వాటికన్ సిటీ అధికారికంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో పోప్ మృతిపట్ల పలువురు ప్రపంచ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సైతం పోప్ మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోప్ మరణ వార్త తీవ్ర బాధను కలిగించిందన్నారు. భారత ప్రజల పట్ల ఆయనకున్న ప్రేమ ఎల్లప్పుడూ గుర్తుండిపోతుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. 'పవిత్ర పోప్ ఫ్రాన్సిస్ మరణం తీవ్ర బాధ కలిగించింది. ఈ విషాద సమయంలో ప్రపంచ క్యాథలిక్ సమాజానికి నా హృదయపూర్వక సంతాపం తెలియజేస్తున్నాను. పోప్.. చిన్నప్పటి నుంచీ ఆయన ప్రభువైన క్రీస్తు ఆదర్శాలను సాకారం చేసుకోవడానికి తనను తాను అంకితం చేసుకున్నారు. పేదలు, అణగారిన వర్గాలకు ఎంతో శ్రద్ధగా సేవ చేశారు. ఆయనతో సమావేశమైన సందర్భాలను నేను ఎప్పటిగా ప్రేమతో గుర్తుంచుకుంటాను. ఆయన నుంచి ఎంతో ప్రేరణ పొందాను. భారత ప్రజల పట్ల ఆయనకున్న ప్రేమ ఎల్లప్పుడూ గుర్తుండిపోతుంది' అని ప్రధాని తన ఎక్స్ పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌కు గతంలో వాటికన్ సిటీలో పోప్ ఫ్రాన్సిస్‌ను కలిసిన సందర్భంగా దిగిన ఫొటోలను పంచుకున్నారు. అక్టోబర్ 2021లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇటలీ పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. జీ-20 సదస్సులో పాల్గొనేందుకు ఇటలీ వెళ్లిన ప్రధాని.. వాటికన్ సిటీలో మిగతా 2 లో

## పోప్ ఫ్రాన్సిస్... కన్నుమూత

రోమన్ క్యాథలిక్ చర్చి అధిపతి పోప్ ఫ్రాన్సిస్ (88) కన్నుమూత

వాటికన్‌లోని తన నివాసంలో సోమవారం ఉదయం తుదిశ్వాస

గత కొంతకాలంగా శ్వాసకోశ, కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న పోప్

మృతిని అధికారికంగా ధ్రువీకరించిన వాటికన్ వర్గాలు

మరణానికి కొన్ని గంటల ముందు ఈస్టర్ సందేశం ఇచ్చిన పోప్



న్యూఢిల్లీ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : రోమన్ క్యాథలిక్ చర్చి అధిపతి, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది గౌరవించే క్రైస్తవ మత గురువు పోప్ ఫ్రాన్సిస్ (88) కన్నుమూశారు. ఇటలీ కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 7:35 గంటలకు వాటికన్‌లోని తన నివాసమైన కాసా శాంటా మార్టాలో ఆయన తుది శ్వాస విడిచినట్లు వాటికన్ వర్గాలు అధికారికంగా ప్రకటించాయి. గత కొంతకాలంగా పోప్ ఫ్రాన్సిస్ శ్వాసకోశ సమస్యలు, డబుల్ న్యుమోనియా, కిడ్నీ సంబంధిత అనారోగ్యాలతో బాధపడుతున్నారు. ఈ కారణంగా ఫిబ్రవరిలో ఆసుపత్రిలో చేరి 38 రోజుల పాటు చికిత్స పొంది, గత నెలలోనే డిశ్చార్జ్ అయ్యారు. అర్జెంటీనాలో జన్మించిన ఆయన, దక్షిణ అమెరికా నుంచి పోప్ పదవిని చేపట్టిన తొలి వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. ప్రజల పోప్‌గా పేరుగాంచిన ఆయన, మిగతా 2 లో

## మెగా డీఎస్సీ వేగంగా... పూర్తిచేయాలి

ఏపీ సీఎం చంద్రబాబుకు సీపీఐ నేత లేఖ

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ పై హర్షం

వయోపరిమితి పెంచాలని అభ్యర్థన



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్ హర్షణీయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ పేర్కొన్నారు. అయితే, ఈ నోటిఫికేషన్ కు సంబంధించి అభ్యర్థుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వయోపరిమితిపై అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారని, వయోపరిమితిని 47 ఏళ్లకు పెంచాలని కోరారు. ఈ మేరకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు మిగతా 2 లో

## ఏఐతో భారీ నిరుద్యోగం... తప్పదు : గేట్స్, ఒబామా

ఏఐ వల్ల ఉద్యోగాలకు పెను ముప్పు: గేట్స్, ఒబామా ఆందోళన

ఇది గత శతాబ్దంలో చూడని మార్పుగా అభివర్ణన

వైద్యులు, టీచర్ల వంటి మేధస్సు AIతో సులభంగా లభ్యం: గేట్స్

అన్ని రంగాలపై ఏఐ ప్రభావం, కోడింగ్ ఉద్యోగాలకూ ప్రమాదం: ఒబామా

జీవనోపాధి మార్గాలపై పునరాలోచన తప్పనిసరి అని వెల్లడి



న్యూఢిల్లీ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) మానవ జీవితంలో విప్లవాత్మక మార్పులు తీసుకురానున్న తరుణంలో, దాని వల్ల ఉద్యోగ భద్రతకు ఏర్పడబోయే ముప్పుపై ప్రపంచ దిగ్గజాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్, అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఏఐ ప్రభావంపై తీవ్ర హెచ్చరికలు మిగతా 2 లో

## భారత ఎన్నికల సంఘం... రాజీపడింది : రాహుల్

భారత ఎన్నికల సంఘంపై అమెరికాలో రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు

మహారాష్ట్ర ఎన్నికల ఓట్ల లెక్కింపుపై తీవ్ర ఆరోపణలు

రెండు గంటల్లో 65 లక్షల ఓట్లు పోలవడం అసాధ్యమని వ్యాఖ్య

విదేశీ గడ్డపై రాహుల్ విమర్శలపై మండిపడ్డ బీజేపీ



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) పనితీరుపై లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. అమెరికాలోని బోస్టన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ, ఈసీఐ రాజీపడిందని, ఎన్నికల నిర్వహణ వ్యవస్థలో స్పష్టమైన లోపాలు కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపాయి. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న ఓటింగ్ సరళిని రాహుల్ గాంధీ ఉదాహరణగా చూపించారు. "మహారాష్ట్రలో అర్హులైన వయోజనుల సంఖ్య కంటే ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. సాయంత్రం 5:30 గంటలకు మిగతా 2 లో

## వినయం, కరుణ, శాంతి సందేశంతో... స్ఫూర్తినిచ్చారు

తరతరాలకు స్ఫూర్తిగా నిలిచారన్న నారా లోకేశ్

పోప్ ఫ్రాన్సిస్ మృతి దిగ్భ్రాంతిని కలిగించింది: పవన్

పోప్ ఫ్రాన్సిస్ బోధనలు ఎప్పటికీ నిలిచిపోతాయన్న కిషన్ రెడ్డి

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : క్యాథలిక్‌ల అత్యున్నత మత గురువు పోప్ ఫ్రాన్సిస్ మరణం పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన వినయం, కరుణ, శాంతి సందేశం ద్వారా లక్షలాది మందికి స్ఫూర్తిని మిగతా 2 లో



## పోప్ మృతి వార్త ఎంతగానో... కలచివేసింది: జగన్

పోప్ ఫ్రాన్సిస్ మృతిపై జగన్ స్పందన

సంతాప ప్రకటన విడుదల

క్రీస్తు విశ్వాసులపై చెరగని ముద్రవేశారని వెల్లడి



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : క్యాథలిక్ చర్చి అధినేత పోప్ ఫ్రాన్సిస్ మృతి పట్ల వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పోప్ ఫ్రాన్సిస్ మరణవార్త తనను ఎంతో కలచివేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన తన సంతాపాన్ని తెలియజేస్తూ ఒక ప్రకటన విడుదల మిగతా 2 లో

# సంపాదకీయం

## టార్గెట్ సౌత్ సాధ్యమేనా..?

కేంద్రంలో వరుసగా మూడు పర్యాయాలు అధికారంలోకి వచ్చి, దేశవ్యాప్తంగా తిరుగులేని విజయాలు సాధిస్తున్న బలమైన భారతీయ జనతా పార్టీ కి రాజకీయంగా దక్షిణ భారతంలో ఆశించిన స్థాయిలో పట్టు చిక్కడం లేదు. దానికి ఒక దశాబ్దంగా ఈ పార్టీ వేస్తున్న ఎత్తుగడలు, చేస్తున్న ప్రయోగాలు ఫలప్రదం కావ డం లేదు. 129 లోక్‌సభ స్థానాలు ఉన్న దక్షిణాదిలోని ఐదు రాష్ట్రాలలో బీజేపీ 29 లోక్ సభ స్థానాలకు మించి గెలువలేక పోయింది.లోకసభ ఎన్నికల సందర్భంగా మిషన్ దక్షిణాది వ్యూహంలో భాగంగా 50కి పైగా లోక్‌సభ స్థానాలలో విజయం సాధించాలనే బీజేపీ ఆశలు నెరవేరక పోగా కేరళ, తమిళనాడులలో ఎన్ని ప్రయోగాలు చేసినా ఖాతానే తెరవలేదు. బలం ఉన్న కర్ణాటకలో గతం కంటే ఎనిమిది లోక్‌సభ స్థానా లు తగ్గితే, పొత్తులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో మూడు లోక్‌సభ స్థానాలలో గెలువగ లిగిందిఒక్క తెలంగాణలోనే గతం కంటే రెట్టింపు సంఖ్యలో 8 లోక్‌సభ స్థానాలలో విజయం సాధించి, పరువు కాపాడు కోగలిగింది. నిధుల కేటాయింపులో మోదీ ప్రభుత్వం దక్షిణాదిపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నదని, లోక్‌సభ నియోజక వర్గాల పునర్విభజన ద్వారా దక్షిణాది ప్రాబల్యం దెబ్బ తీయాలని చూస్తున్నదనే ఆరోపణలు ఉన్నాయి.గత లోక్‌సభ ఎన్నికలలో సొంత బలంతో దక్షిణాదిలో ఎదగాలనే రాజకీయ వ్యూహం ఫలించలేదు. దీంతో దక్షిణాదిలో రాజకీయంగా బలపడటానికి, కాంగ్రెస్ దాని మిత్రపక్షాలను బలహీన పరచటానికి బీజేపీ తన రాజకీయ వ్యూహాలను మార్చుకుంటున్నట్లుగా కనిపిస్తుంది. 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో జనసేన, తెలుగుదేశం పార్టీలతో చివరి నిమిషంలో, కర్ణాటకలో జేడీఎస్ తోనూ పొత్తు పెట్టుకోవటం బీజేపీకి రాజకీయంగా కలిసి వచ్చింది. కాబట్టి, దక్షణ భార తంపై రాజకీయంగా పట్టు సాధించాలన్నా, కాంగ్రెస్ దాని బలమైన మిత్రపక్షం డీఎంకేని బలహీన పరచాలన్నా 39 లోక్‌సభ స్థానా లు ఉన్న పెద్ద రాష్ట్రమైన తమిళనాడుపై పట్టు సాధించాల్సి ఉంటుంది.వ్యూహం లో భాగంగానే తన పాత మిత్రపక్షమైన అన్నా డీఎంకేతో మరొకసారి భారతీయ జనతా పార్టీ పొత్తుకి సిద్ధమైంది. ఇది రాజకీయ వర్గాలను ఆశ్చర్య పరిచిందనే చెప్పాలి. ద్రవిడ పార్టీల సహకారం లేకుండా తమిళనాడుపై పట్టు సాధించలేమని గత లోక్‌సభ ఎన్నికలు నిరూపించాయి. ఈ నేపథ్యంలో తమిళనాడులో డీఎంకే, కాంగ్రెస్, వీసీకే, ఐయుఎంఎల్, వామపక్ష పార్టీల కూటమిని ఎదుర్కొని పాగా వేయాలంటే అన్నా డీఎంకేతో పొత్తు అనివార్యమని భావించారు.మేరకు అమిత్ షా తన రాజకీయ వ్యూహాలలో భాగంగా అనూహ్య నిర్ణయం తీసుకున్నారనే చెప్పాలి. 2026లో తమిళనాడులో జరగనున్న శాసనసభ ఎన్నికలలో డీఎంకేని ఓడించడం ద్వారా 2029 లోక్‌సభ ఎన్నికలలో తమిళనాడులో పట్టు సాధించాలనేది ఆ పార్టీ వ్యూహం వలె ఉన్నది. గత లోక్‌సభ ఎన్నికలలో 8 చిన్న పార్టీలతో పొత్తు పెట్టుకుని అన్నామలై లాంటి యంగ్ లీడర్‌తో పోరాటం చేసినా ఒక్క లోక్‌సభ స్థానాన్ని కూడా గెలువలేక పోయింది.లోక్‌సభలో ఐదవ అతిపెద్ద పార్టీగా ఉన్న డీఎంకేని, దక్షిణాది నుంచి కేంద్ర ప్రభుత్వం కంట్లో నలుసుగా మారిన ఎంకే స్టాలిన్‌ని దెబ్బ తీయటానికి షా రూ పొందించిన మంత్రాంగంగా పై పొత్తును భావిస్తున్నారు. జయలలిత మరణం తర్వాత అనేక సవాళ్లను ఎదుర్కొని మాజీ ముఖ్యమంత్రి పళనిస్వామి తమిళనాడులో అన్నా డీఎంకేని బలమైన పార్టీగా నిలుపగలిగారు.2024 లోక్‌సభ ఎన్నికలలో ఆ పార్టీ ఒంటరిగా 23 శాతం ఓట్లను సాధించింది కనుకే అన్నా డీఎంకే, బీజేపీ జత కడితే రెండు పార్టీల బలం 41 శాతం అవుతుంది. ఈ రకంగా డీఎంకే కూటమికి బలమైన ప్రత్యర్థిగా నిలబడవచ్చున్నది షా అంచనా. పన్నీరు సెల్వం, దినకరన్ లాంటి వాళ్ళని కూడా తమవైపుకు తిప్పుకొని డీఎంకేకి గట్టి పోటీ ఇవ్వాలనేది ఆయన వ్యూహంగా కనిపిస్తుంది.మరొకవైపు సినీ హీరో విజయ్ పార్టీ టీవీకే చీల్చే ఓట్లుకూడా తమిళనాడు రాజకీయాలను ప్రభావితం చేయబోతున్నాయి. తమిళనాడులో షా ఎత్తుగడతో డీఎంకే, కాంగ్రెస్‌లు కొంత ఆత్మరక్షణలో పడినట్లుగానే కనిపిస్తున్నది. కర్ణాటకలో జేడీ(ఎస్)తో, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జనసేనలతో, తమిళనాడులో అన్నా డీఎంకేతో ఆయా రాష్ట్రాలలో పాగా వేసి, ప్రత్యర్థి పార్టీల దూకుడుకు కళ్లెం వెయ్యడమే బీజేపీ 'ప్లాన్‌బి'గా కనిపిస్తున్నది. దక్షిణాదిలో బలం పెంచుకోవడానికి ఇక్కడి రాష్ట్రాల నుంచి బీజేపీకి కొత్త జాతీయ అధ్యక్షుడిని ఎంపిక చేయాలన్నది ఆ పార్టీ వేస్తున్న మరొక ఎత్తుగడగా విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలోనూ తమిళనాడు నుంచి జానా కృష్ణమూర్తి, ఆంధ్రప్రదేశ్ నుంచి వెంకయ్య నాయుడు, తెలంగాణ నుంచి బంగారు లక్ష్మణ్ లాంటి వారు బీజేపీ జాతీయ అధ్యక్షులుగా పని చేశారు.తమిళనాడు నుంచి అన్నామలై, తెలంగాణ నుంచి కిషన్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ నుంచి పురంధరేశ్వరి బీజేపీ జాతీయ అధ్యక్ష పదవి రేసులో వినపడుతున్న పేర్లు. ఆ పార్టీ జాతీయ అధ్యక్ష పదవికి దక్షిణాది రాష్ట్రాలకు చెందిన వారిని ఎంపిక చేయటం ద్వారా తమది ఉత్తరాది పార్టీ మాత్రమే కాదు,దక్షిణాదికి కూడా ప్రాధాన్యం ఇస్తుందనే సంకేతం ప్రజలలోకి పంపాలనేది పార్టీ వ్యూహం అంతరార్థంగా కనిపిస్తున్నది. రాబోయే లోక్‌సభ ఎన్నికల నాటికి దక్షిణాదిలో బలపడటానికి ఏ ఒక్క చిన్న అవకాశాన్ని కూడా వదులుకోవడానికి భారతీయ జనతా పార్టీ ఇష్టపడటం లేదు. దేశంలో ఇప్పటికే బీజేపీ 16 రాష్ట్రాలలో, దాని మిత్రపక్షాలు ఆరు రాష్ట్రాలలో అధికారంలో ఉన్నాయి. 18వ లోక్‌సభ ఎన్నికల ఫలితాలలో పార్టీ కొంత బలహీన పడినట్లుగా కనిపించినా లోక్‌సభ ఎన్నికల అనంతరం ఐదు రాష్ట్రాలలో ఎన్నికలు జరిగితే, ఇప్పటికే అధికారంలో ఉన్న హర్యానా, మహారాష్ట్ర ఎన్నికలలోనూ దానిని నిలబెట్టుకోవచ్చు. ఇండియా కూటమిలోని ఆమ్ ఆద్మీ పార్టీని ఓడించి 27 సంవత్సరాల తర్వాత ఢిల్లీలో అధికారాన్ని సొంతం చేసుకోవడం ద్వారా మరోసారి బీజేపీ తన బలాన్ని నిరూపించుకుంది. మొత్తం మీద బీజేపీ చాపకింద నీరులా ఒక్కొక్క రాష్ట్రాన్ని తన ఖాతాలో వేసుకుంటున్నది. 2025 చివరిలో జరిగే బీహార్ శాసనసభ ఎన్ని కలలోనూ, 2026లో జరిగే పశ్చిమ బెంగాల్, తమిళనాడు శాసనసభ ఎన్నికలలోనూ గెలువడానికి బీజేపీ బలమైన వ్యూహాలనే సిద్ధం చేసుకుంటుంది.121 లోక్‌సభ స్థానాలు గల ఈ మూడు పెద్ద రాష్ట్రాలలో గెలుపు సాధిస్తే (18వ లోక్‌సభ ఎన్నికలలో ఈ మూడు రాష్ట్రాల నుంచి పార్టీ గెలిచిన లోక్‌సభ స్థానాలు కేవలం 42 మాత్రమే) దేశంలో భారతీయ జనతా పార్టీ తిరుగులేని రాజకీయ శక్తిగా ఎదిగే అవకాశాలు ఉంటాయి. బీజేపీకి కలిసి వచ్చే అంశం ఆ పార్టీ అధికారంలో ఉన్న అనేక రాష్ట్రాలలో దాని బలం చెక్కు చెదరటం లేదు.ఇదే సమయంలో విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో వాటి పూర్వపు బలాన్ని కోల్పోతున్నాయి. మరొక వైపు దేశంలో ఏ ఒక్క రాష్ట్రంలో కూడా (తెలంగాణ మినహాయిస్తే) కాంగ్రెస్ తన బలాన్ని పెంచుకోలేక పోతున్నది. ఇది కూడా ఒకింత బీజేపీకి రాజకీయంగా కలిసివస్తున్నది. తమిళనాడులో స్టాలిన్, పశ్చిమ బెంగాల్‌లో మమత బెనర్జీ, బీహార్‌లో తేజస్వి యాదవ్, ఉత్తరప్రదేశ్‌లో అఖిలేష్ యాదవ్‌లే బీజేపీని కొంత ప్రతిఘటిస్తున్నారు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లలో బీజేపీ రాజకీయ వ్యూహాలు ఫలిస్తే పార్టీ దేశంలో మరింత బలపడుతుంది. తమిళనాడులో ఆ పార్టీ అన్నా డీఎంకేతో పొత్తు ఆంధ్రప్రదేశ్‌లో లాగా విజయవంతమైతే దక్షిణాదిలో బీజేపీకి మరింత బలం పెరుగుతుంది.దక్షిణాదిలో కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలో పార్టీ రాజకీయ ఎత్తుగడలు ఫలిస్తే ఈ మొత్తం ప్రాంతంపై దానికి పట్టు చిక్కినట్లే అనుకోవాలి. హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ శాసనసభ ఎన్నికలలో షా మంత్రాంగం ఫలించినట్లుగానే తమిళనాడులో కూడా ఫలిస్తుందో లేదో చూడాలి. ఇందుకు తమిళనాడు శాసనసభ ఎన్నికల వరకు వేచి ఉండాల్సిందే.

# ఏఐతో భారీ నిరుద్యోగం...

జారీ చేశారు. రాబోయే సంవత్సరాల్లో ఏఐ లక్షలాది ఉద్యోగాలను భర్తీ చేస్తుందని, ఇది గత వందేళ్లలో ప్రపంచం చూడని అతిపెద్ద మార్పు కానుందని వారు స్పష్టం చేశారు. బిల్ గేట్స్ మాట్లాడుతూ, ప్రస్తుతం అరుదుగా లభించే మేధస్సు (ఉదాహరణకు గొప్ప వైద్యులు, ఉపాధ్యాయుల నైపుణ్యం) ఏఐ సహాయంతో రాబోయే దశాబ్ద కాలంలో ఉచితంగా, సర్వసాధారణంగా అందుబాటులోకి వస్తుందన్నారు. "ఇది వైద్య సలహాలు, ట్యూటరింగ్ వంటి అనేక సమస్యలను పరిష్కరిస్తుంది. అయితే, ఇది ఉద్యోగాల స్వరూపాన్ని, పని విధానాలను పూర్తిగా మార్చివేస్తుంది. వారానికి రెండు, మూడు రోజులు పనిచేస్తే సరిపోతుందేమో" అని ఆయన అభిప్రాయపడ్డారు. ఏఐ ఆవిష్కరణలను ముందుకు తీసుకెళుతుందని అంగీకరిస్తూనే, దానివల్ల కలిగే మార్పులు కొంత భయానకంగా ఉన్నాయని గేట్స్ వ్యాఖ్యానించారు. మరోవైపు, బరాక్ ఒబామా మాట్లాడుతూ, ఏఐ సాంకేతికత గతంలోని అన్ని టెక్నాలజీ మార్పుల కంటే వేగంగా, మరింత ప్రభావవంతంగా ఉండబోతోందని హెచ్చరించారు. "ఇది కేవలం తయారీ రంగంలోని ఆటోమేషన్ లాంటిది కాదు. ఉన్నత స్థాయి మేధోపరమైన పనులను కూడా ఏఐ చేయగలదు. ఇప్పటికే చాలా మంది సాఫ్ట్‌వేర్ డెవలపర్ల కంటే మెరుగ్గా ఏఐ కోడింగ్ చేయగలుగుతోంది. సిలికాన్ వ్యాలీలో మంచి జీతాలతో ఉన్న ఉద్యోగాలు కూడా ప్రమాదంలో పడతాయి" అని ఒబామా వివరించారు. అత్యున్నత నైపుణ్యం గల నిపుణులు ఏఐని తమ పనిని మెరుగుపరుచుకోవడానికి ఉపయోగిస్తారని, కానీ సాధారణ స్థాయి ఉద్యోగాలు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఒబామా అన్నారు. "కేవలం కార్మికులు, ఫ్యాక్టరీ ఉద్యోగులే కాదు, ఇప్పుడు అందరూ 'ఉద్యోగం ఎలా సంపాదించాలి? కుటుంబాన్ని పోషించుకోవడానికి ఆదాయం ఎలా పొందాలి?' అని ఆలోచించాల్సిన పరిస్థితి వస్తుంది. మనం ఎంతో ఉత్పత్తి చేస్తున్నప్పుడు, దాన్ని ఎలా పంపిణీ చేయాలి? జీవితంలో మన పరమార్థం ఏమిటి? అనే ప్రశ్నలను మనమందరం ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని ఒబామా నొక్కిచెప్పారు.

# వినయం, కరుణ, శాంతి సందేశంతో...



లక్షలాదిమంది క్రైస్తవులకు ఆదర్శంగా నిలిచిన పోప్ ఫ్రాన్సిస్ మృతి తనను ఇచ్చిన ఆధ్యాత్మిక గురువు పోప్ ఫ్రాన్సిస్ మరణం తనకు చాలా బాధ కలిగించిందని చంద్రబాబు 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. మానవాళిని ప్రేమ, దయతో నడిపించారని కొనియాడారు. శాంతి సందేశం ద్వారా లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చారని ఆయన గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల తరఫున ప్రపంచ క్యాథలిక్ సమాజానికి తన సంతాపం తెలియజేస్తున్నట్లు ప్రకటించారు. ఆధ్యాత్మిక నాయకత్వంలో తరతరాలకు పోప్ ఫ్రాన్సిస్ స్ఫూర్తిగా నిలిచారని నారా లోకేశ్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది జీవితాలను స్పృశించారని మంత్రి పేర్కొన్నారు.

**పోప్ ఫ్రాన్సిస్ మృతి దిగ్భ్రాంతిని కలిగించింది: పవన్**

పోప్ ఫ్రాన్సిస్ మరణం పట్ల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఫిబ్రవరిలో శ్వాసకోశ సమస్యతో ఆసుపత్రిలో చేరిన ఆయన, ఈస్టర్ సందర్భంగా చివరి సందేశం ఇచ్చారు. వాటికన్ సిటీలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. ప్రపంచవ్యాప్తంగా



దిగ్భ్రాంతికి గురిచేసిందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గదర్శకత్వం, కరుణ, మానవత్వం అందరికీ ఆదర్శమని, ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. ప్రపంచ క్రైస్తవ సమాజానికి పవన్ కల్యాణ్ సంతాపం తెలిపారు. పోప్ ఫ్రాన్సిస్ ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థించారు.

**ఆయన బోధనలు ఎప్పటికీ నిలిచిపోతాయి: కిషన్ రెడ్డి**

పోప్ ఫ్రాన్సిస్ మరణం తనకు చాలా బాధ కలిగించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. శాంతి, ప్రేమ, కరుణ గురించి ఆయన బోధనలు ఎప్పటికీ నిలిచిపోతాయని పేర్కొన్నారు. ప్రపంచ క్యాథలిక్ సమాజానికి సంతాపం తెలిపిన కిషన్ రెడ్డి, పోప్ ఫ్రాన్సిస్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# కొరగాని కొయ్యగా ఆదినారాయణరెడ్డి

కడప : జమ్మలమడుగు బిజెపి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి వ్యవహార శైలి చర్చకు దారితీస్తోంది. గత కొద్దిరోజులుగా స్థానిక పరిశ్రమల యాజమాన్యాలకు, ఆయనకు మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో కొంతమంది నేతలతో సైతం ఆయన వివాదాలు పెట్టుకుంటున్నారు. మొన్న ఆ మధ్యన అనంతపురం జిల్లాకు చెందిన టిడిపి నేత జెసి ప్రభాకర్ రెడ్డి వర్గీయులతో వివాదం నడిచింది. అక్కడకు కొద్ది రోజుల తరువాత సొంత పార్టీ ఎంపీ సీఎం రమేష్ తో సైతం విభేదించారు ఆదినారాయణ రెడ్డి. ఇప్పుడు స్థానికంగా ఉన్న ఓ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తోందని ఆరోపిస్తున్నారు ఆదినారాయణ రెడ్డి. స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని చెబుతున్నారు. గత కొద్దిరోజులుగా ఆ ఫ్యాక్టరీ ఉత్పత్తులకు సంబంధించి ముడుసరుకుల రవాణాను ఆదినారాయణ రెడ్డి వర్గీయులు అడ్డుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆదినారాయణ రెడ్డి ఈ విషయంపై స్పందించారు. తనది తప్పని తేలితే రాజకీయాలనుంచి వైదొలుగుతానని స్పష్టం చేశారు.కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలో అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ ఉంది. అయితే ఆ కంపెనీలో స్థానికులకు అవకాశం ఇవ్వాలని ఆదినారాయణ రెడ్డి కోరుతున్నారు. అయితే ఇప్పటికే కంపెనీలో కాంట్రాక్ట్ పనులకు సంబంధించి గడువు ఉంది. కానీ దానితో సంబంధం లేకుండా తన వర్గీయులకు పనులు కేటాయించాల్సిందేనని ఆయన తేల్చి చెబుతున్నారు. సంబంధిత యాజమాన్యం పట్టించుకోకపోవడంతో ఆదినారాయణ రెడ్డి వర్గీయులు ఫ్యాక్టరీ ఉత్పత్తులు, ముడి సరుకుల రవాణాను అడ్డుకుంటున్నారన్నది ఒక ప్రచారం. ఇదే విషయంపై సంబంధిత ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో పాటు మీడియాకు సమాచారం ఇచ్చింది. అలా వెలుగులోకి వచ్చింది ఆ వివాదం. దీనిపై ఆదినారాయణ రెడ్డి స్పందిస్తూ త్వరలో చంద్రబాబుకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.కొద్ది రోజులుగా ఆదినారాయణ రెడ్డివ్యవహారం కూటమికి తలనొప్పిగా మారింది. జమ్మలమడుగు నియోజకవర్గంలో ఫ్యాక్టరీల యాజమాన్యాలపై జులుం ప్రదర్శిస్తున్నారంటూ ఆదినారాయణ రెడ్డి పై విమర్శలు ఉన్నాయి. సిమెంట్ ఫ్యాక్టరీలకు అవసరమైన ముడుసరుకు సరఫరా కాంట్రాక్టులతో పాటుగా అన్ని రకాల కాంట్రాక్టులు తన వారికే ఇవ్వాలని ఆదినారాయణ రెడ్డి డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అయితే స్థానికుల తరుపున పోరాడుతున్నందునే తనపై ఆరోపణలు చేస్తున్నారని ఆదినారాయణ రెడ్డి చెబుతున్నారు. తనది తప్పని తేలితే రాజకీయాల నుంచి తప్పుకుంటానంటూ ఆదినారాయణ రెడ్డి సంచలన ప్రకటన చేశారు.జమ్మలమడుగు నియోజకవర్గంలోని ఎర్రగుంట్ల, చిలమకూరులో అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ యూనిట్లు ఉన్నాయి. ఇది గతంలో ఇండియా సిమెంట్స్ ఆధీనంలో ఉండేవి. గత ఏడాది నుంచి అల్ట్రాటెక్ యాజమాన్యం పరిధిలోకి వెళ్లాయి. అయితే ఈ యూనిట్లకు ఫ్లైయాష్, సున్నపురాయి సరఫరా జరగకుండా ఇటీవల ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి వర్గీయులు అడ్డుకున్నారు. రాయలసీమ థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి ఈ ఫ్యాక్టరీలకు తరలిస్తుంటారు. వాటిని ఆదినారాయణ రెడ్డి అనుచరులు అడ్డుకోవడం వివాదంగా మారింది. లారీలను నిలిపివేయడంతో ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో సంబంధిత యాజమాన్యం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. మీడియాలో పతాక శీర్షికన కథనాలు రావడంతో జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి స్పందించారు. ఇందులో తన తప్పు లేదని చెప్పుకునే ప్రయత్నం చేశారు.

# ఏకగ్రీవం నిలుపుకుంటారా...

హైదరాబాద్ : హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీలో 22ఏళ్లుగా మజ్లిస్ పార్టీ ఏఐఎంఐఎం పార్టీకే ఏకగ్రీవం. కానీ ఇప్పుడలా కుదరదంటూ బరిలోకి దిగింది భారతీయ జనతా పార్టీ. పాతబస్తీపై పట్టున్న మజ్లీస్‌కు వ్యతిరేకంగా బీజేపీ నిలబడింది. దీంతో హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోటీ రసవత్తరంగా మారింది. దాదారు 22 ఏళ్ల తర్వాత ఏప్రిల్ 23వ తేదీన ఎన్నిక జరగనుంది.హైదరాబాద్ జిల్లా పరిధిలో జరిగే లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నిక కావడంతో బలాబలాలను పరిగణలోకి తీసుకుని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తమ అభ్యర్థులను నిలబట్టలేదు. మెజారిటీ మెంబర్స్ ఉన్న ఎంఐఎం అభ్యర్థి ఎన్నిక ఏకగ్రీవం అనుకున్న తరుణంలో సెకెండ్ హయ్యేస్ట్ మెజారిటీ ఉన్న బీజేపీ బరిలో దిగడంతో ఎన్నికల ఓటింగ్ అనివార్యమైంది. ఎంఐఎం తరపున మిర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి, బీజేపీ తరపున గౌతమ్ రావు అభ్యర్థులుగా పోటీ పడుతున్నారు.ఈ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు మొత్తం 112 ఓట్లు ఉండగా.. అందులో 81 మంది కార్పొరేటర్లు, 31 మంది ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. మజ్లిస్ పార్టీకి 40 మంది కార్పోరేటర్లు, 9 మంది ఎక్స్ అఫీషియో సభ్యులతో 49 ఓట్ల బలం ఉంది. బీజేపీకి 19 మంది కార్పొరేటర్లు 6 మంది ఎక్స్ అఫీషియో సభ్యులతో కలిపి 25 మంది , బీఆర్ఎస్ కు 15+9 కలిపి 24. కాంగ్రెస్ 7+7 తో 14 సభ్యుల సంఖ్యాబలం ఉన్నాయి. ఎక్స్ అఫీషియో సభ్యుల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారు. ఇప్పటికే పోలింగ్‌కు దూరంగా ఉండాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయకపోయినప్పటికీ, ఎంఐఎంకు మద్దతు తెలుపుతుందని ఆ పార్టీ ఆశాభావంతో ఉంది. నామినేషన్ నాడే తమ గెలుపు లాంఛనం అంటూ ఎంఐఎం అభ్యర్థి ధీమా వ్యక్తం చేశారు.గెలుపు కోసం కావాల్సిన సరైన సంఖ్యాబలం లేకున్నా.. బల్దియాపై పట్టు బిగించేందు కాషాయనేతలు పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అంతేకాదు కాంగ్రెస్, బీఆర్ఎస్ జట్టుగా ఎంఐఎంకు సహకరిస్తున్నాయని ప్రజలకు ప్రూవ్ చేయడం తమ లక్ష్యమని బీజేపీ నేతలు చెబుతున్నారు. మరోవైపు హైదరాబాద్ మహానగరంలో ఎంఐఎం ఆగడాలకు వ్యతిరేకంగా ప్రజలు బీజేపీ గెలుపును కోరుకుంటున్నారని, అందుకనుగుణంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పోరేటర్లు కూడా తమకు ఓటేస్తారని బీజేపీ అభ్యర్థి గౌతం రావు అంటున్నారు. జాతీయ వాదానికి, జాతీ విద్రోహులకు జరుగుతున్న ఈ ఎన్నికల్లో డెఫినెట్ గా ఆయా పార్టీలను కాదని కార్పొరేటర్లు తనకు ఓటేస్తారని గౌతమ్ రావు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు ఏ ఎవైనా గెలుపోటములు లెక్కచేయకుండా పోటీ చేసే పార్టీ బీజేపీ అని.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని ఆయన అన్నారు.హైదరాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కమలనాథులు.. గట్టిగానే కసరత్తు చేస్తున్నారు. పోలింగ్ నాటికి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఝలక్ ఇచ్చేలా తమకు ఉన్న 25 ఓట్ల కంటే అదనంగా ఓట్లు సాధిస్తామని అంటున్నారు. మరోవైపు ఇతర పార్టీల కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలతో మాట్లాడి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ బీజేపీ పార్టీలోకి వస్తామన్న కార్పొరేటర్లకు పొలిటికల్ కేరీర్ గ్యారంటీ కూడా ఇస్తున్నట్లు సమాచారం. దీంతో చివరి క్షణం వరకు బీజేపీ ప్లాన్ ఎంతమేరకు వర్క్ అవుట్ అవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గాలిపటం విజయబావుట ఎగురవేస్తుందా.. లేక నిజంగానే ఏదైనా మిరాకిల్ జరిగి కమలం వికసిస్తుందా వేచి చూడాలి..!

# భారతీయుల పట్ల ...

పోప్ ఫ్రాన్సిన్‌ను కలిశారు. దాదాపు 30 నిమిషాలపాటు పోప్ ఫ్రాన్సిస్, ప్రధాని మోదీ వివిధ విషయాలపై మాట్లాడుకున్నారు. అనంతరం భారత్‌కు రావాల్సిందిగా పోప్‌ను ప్రధాని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయనకు పలు ప్రత్యేకమైన బహుమతిని కూడా అందజేశారు. పూర్తిగా సిల్వర్‌తో తయారు చేసిన క్యాండిల్ స్టాండ్, ఓ పుస్తకాన్ని పోప్‌కు ప్రధాని బహుమతిగా ఇచ్చారు. ఫ్రాన్సిస్ కూడా మోదీకి ఓ గిఫ్ట్ ఇచ్చారు. బ్రాంజ్‌తో తయారు చేసిన ఓ సర్క్యులర్ మెమోంటోను అందజేశారు. బైబిల్ సూక్తులతో ఉన్న ఆ గిఫ్ట్‌ను మోదీ అందుకున్నారు.

# పోప్ ఫ్రాన్సిస్...

సామాజిక అంశాలపై తన గళం వినిపించేవారు. ఆశ్చర్యకరంగా, మరణించడానికి కొన్ని గంటల ముందు ఈస్టర్ పర్వదినాన సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో వేలాది మంది భక్తులకు ఆయన సందేశం ఇచ్చారు. అనారోగ్యం తర్వాత అంతమంది ప్రజల మధ్యకు రావడం అదే తొలిసారి. ఆయన మృతితో ప్రపంచవ్యాప్తంగా కేథలిక్ సమాజం విషాదంలో మునిగిపోయింది. కార్డినల్ ఫారెల్ ఆయన మృతిని ప్రకటిస్తూ, పోప్ ఫ్రాన్సిస్ జీవితం ప్రభువుకు, చర్చికి సేవ చేయడానికే అంకితమైందని పేర్కొన్నారు.

# ఓటు వేయకుండా కార్పొరేటర్లను...

ప్రజాస్వామ్యంలో హక్కు అని, కానీ కార్పొరేటర్లు ఓటు వేయకుండా బీఆర్ఎస్ అగ్రనేతలు బెదిరిస్తున్నారని ఆరోపించారు. మజ్లిస్ పార్టీ రజాకార్ల వారసుల పార్టీ అని ధ్వజమెత్తారు. మతతత్వ మజ్లిస్ పార్టీతో చేతులు కలిపిన కాంగ్రెస్, బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీలు ఎలా అవుతాయని ప్రశ్నించారు. బీజేపీకి బలం లేకపోయినప్పటికీ హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచింది. దీంతో ఈ ఎన్నికలు ఆసక్తిగా మారాయి. బీజేపీ క్రాస్ ఓటింగ్‌పై ఆశలు పెట్టుకున్నదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే పలువురు బీఆర్ఎస్ కార్పొరేటర్లతో బీజేపీ ఎంపీలు సమావేశమైనట్లు సమాచారం.

# మెగా డీఎస్సీ వేగంగా...

సోమవారం రామకృష్ణ లేఖ రాశారు. 2018 తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వలేదని రామకృష్ణ తన లేఖలో గుర్తుచేశారు. అప్పటి నుంచి డీఎస్సీ నోటిఫికేషన్ కోసం చాలామంది అభ్యర్థులు వేచి చూస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో అభ్యర్థుల్లో వయోపరిమితిపై ఆందోళన నెలకొందని చెప్పారు. వయోపరిమితి 47 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకోవాలని, మెగా డీఎస్సీ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని రామకృష్ణ తన లేఖలో సీఎం చంద్రబాబును కోరారు.

# నేడు సిట్ విచారణకు...



విషయం తెలిసిందే. ఇటీవల ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, ఆయనకు మధ్యంతర రక్షణ కల్పించడానికి నిరాకరించింది. ఆయన తరఫు న్యాయవాది చేసిన విజ్ఞప్తిని కోర్టు తోసిపుచ్చింది. తదుపరి విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. కాగా, సిట్ అధికారులు గతంలో మూడు పర్యాయాలు నోటీసులు ఇచ్చినా రాజ్ కసిరెడ్డి విచారణకు హాజరు కాలేదు. తాజాగా హైకోర్టులోనూ ఊరట లభించకపోవడం, కోర్టులో విచారణ ఆలస్యం అవుతుండడంతో ఆయన సిట్ ఎదుటకు రావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఇదే కేసులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత విజయసాయిరెడ్డి సిట్ విచారణకు హాజరైన అనంతరం కూడా రాజ్ కసిరెడ్డి ఒక ఆడియో విడుదల చేశారు. తనపై విజయసాయిరెడ్డి ఆరోపణలు చేసినప్పటికీ, బెయిల్ పిటిషన్ కోర్టు పరిధిలో ఉన్నందున తాను స్పందించడం లేదని ఆ సందేశంలో పేర్కొన్నారు. త్వరలోనే విజయసాయిరెడ్డి బండారం బయటపెడతానని హెచ్చరించారు. ఇప్పుడు న్యాయస్థానంలో అనుకూల నిర్ణయం రాకపోవడంతో సిట్ విచారణను ఎదుర్కోవడానికి సిద్ధమైనట్లు స్పష్టమవుతోంది.

# పోప్ మృతి వార్త ఎంతగానో...



చేశారు. పోప్ ఫ్రాన్సిస్ క్యాథలిక్ చర్చికి అధినేతగా విశేషమైన సేవలు అందించారని జగన్ కొనియాడారు. ఆయన హయాంలో చర్చి వ్యవస్థలో పరివర్తనాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయని, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది క్రీస్తు విశ్వాసులపై ఆయన చెరగని ముద్ర వేశారని తెలిపారు. లాటిన్ అమెరికా ప్రాంతం నుంచి ఈ అత్యున్నత పదవికి ఎన్నికైన తొలి వ్యక్తిగా పోప్ ఫ్రాన్సిస్ చరిత్ర సృష్టించారని జగన్ కీర్తించారు. పోప్ ఫ్రాన్సిస్ కేవలం మత పెద్దగానే కాకుండా, ఒక నిజమైన మానవతావాదిగా నిలిచారని వైఎస్ జగన్ అభివర్ణించారు. ప్రపంచ శాంతి కోసం... పేదలు, అణగారిన వర్గాల పట్ల కరుణ చూపడంలో ఆయన ఎల్లప్పుడూ ముందున్నారని కొనియాడారు. ఆయన వినయం, మానవత్వం ప్రపంచాన్ని ఎంతగానో స్పృశించాయని పేర్కొన్నారు. శాంతి, కరుణ కోసం ఆయన గొంతుక ప్రపంచవ్యాప్తంగా వినిపించిందని తెలిపారు. పోప్ ఫ్రాన్సిస్ ఆత్మకు శాశ్వత శాంతి చేకూరాలని తాను ప్రార్థిస్తున్నట్లు వైఎస్ జగన్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచానికి, ముఖ్యంగా క్యాథలిక్ సమాజానికి ఆయన లేని లోటు తీరనిదని పేర్కొన్నారు.

## కుటుంబ సమేతంగా దర్శించుకున్న....
## త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి



శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 21: శ్రీకాళహస్తి శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మ వార్ల దర్శనార్థమై త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి కుటుంబ సమేతంగా విచ్చే శారు.విచ్చేశారు వారిని దేవస్థానం కార్య నిర్వహణాధికారి టి.బాపిరెడ్డి స్వాగతం దక్షిణ గాలిగోపురం వద్ద స్వాగతం




పలి కారు .శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థా నంలో ప్రత్యేక రాహు కేతు పూజ చేయిం చుకుని అనంతరం స్వామి అమ్మవార్ల ప్రత్యేక దర్శనం



ఏర్పాటు చేశారు.మృత్యుం జయ స్వామి సన్నిధానం వద్ద డిప్యూటీ ఈవో ఎన్ ఆర్ కృష్ణారెడ్డి గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి శేషవస్త్రంతో సత్కరించి వేదపండితులచే ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని,తీర్థప్రసాదాలను అందచేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ వో ఎన్.ఆర్. కృష్ణారెడ్డి, దేవస్థానం ఏ.ఈఓ విద్యాసాగర్ రెడ్డి, దేవస్థానం సూపర్డెంట్ అండ్ సి.ఎస్.ఓ నాగభూషణం యాదవ్, దేవస్థానం అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## మహా కుంభాభిషేకానికి .....
## భక్తులు భారీగా తరలి రండి...



వీ.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 21.వీకోట మండలం పాము గాని పల్లి పంచాయతీ గుమిరెడ్డిపల్లి గ్రామంలోఈనెల 23, 24 తేదీలలో జరగబోయే గ్రామ దేవత శ్రీ పెద్దపులి గంగమాంబ ఆలయ కుంభా భిషేకము మరియు గ్రామ దేవత పెద్దపులి గంగమ్మ ప్రతిష్టాపన అతి వైభవంగా నిర్వ హించుటకు దైవ కార్యమును నిర్వహిం చుటకు ఆలయ ధర్మకర్త పురుషోత్తమ నాయుడు ఆధ్వర్యంలో గుమ్మిరెడ్డిపల్లి గ్రామస్తుల సహాయ సహకారాలతో ఆలయ ప్రధాన అర్చకులు భాస్కర్ శర్మ ఈ కార్య క్రమాన్ని నిర్వహిస్తారు.కావున గ్రామస్తుల తోపాటు మండలంలోని అన్ని గ్రామాల నుండి భక్తాదులు అధికంగా తరలివచ్చి అమ్మవారి కైంకర్యాల్లో పాల్గొని అమ్మవారి దివ్య ఆశీస్సులను పొంది,అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించా ల్సిందిగా ధర్మకర్త పురుషోత్తమ నాయుడు మరియు గుమ్మిరెడ్డిపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

## విద్యార్థిని దర్శిని కి ఆర్థికసాయం
### అందించిన కొత్తపేట ఇన్చార్జ్ (అప్పు) ముఖేష్

కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 21: ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు 75వ జన్మదిన సందర్భం గా కుప్పం మున్సిపాలిటీ కొత్తపేట కుర్మయి పురం హరిజన వాడకు చెందిన నిరుపేద విద్యార్థిని వి. దర్శిని D/o లేట్ వెంకటేష్ కుమార్తె కుప్పం పి ఈ ఏస్ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు పొందడంవల్ల వారి యొక్క చదువుల అవసర కోసం విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు డాక్టర్ ఎమ్మెల్సీ కంచర శ్రీకాంత్, కుప్పం ని యోజకవర్గ ఇంచార్జ్ పి.ఎస్.మునిరత్నం, ఆదేశాల మేరకు మున్సిపల్ అధ్యక్షులు రాజ్ కుమార్,క్లస్టర్ ఇంచార్జ్ సత్యేంద్ర శేఖర్, సూచన మేరకు కొత్తపేట ఇంచార్జ్ అప్పు ముఖేష్ 10000/రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఆమె ఎంబిబిఎస్ పూర్తి చేయడానికి అన్ని విధా లుగా చంద్రబాబు నాయుడు సహకారం తో మరెన్నో సహాయం అందిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కౌన్సి లర్ సోము, డిఎన్ఎస్ఎఫ్ ,మునియప్ప, రాహుల్, కుమార్,సుకుమార్,మనోహర్, మధు,లోకేష్,మనీ,తదితరులు పాల్గొన్నారు.



# కొత్త ఆర్టీసీ బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే



సత్యవేడు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 21: తిరుపతి జిల్లా సత్యవేడు ఆర్టీసీ డిపోకు సంబంధించి కొత్త ఆర్టీసీ బస్సుకు స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రారంభో త్సవం చేశారు.సోమవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటరమణ ఆధ్వర్యంలో సత్యవేడు టు తిరుమల సర్వీసుకు సంబంధించి కొత్త ఆర్టీసీ బస్సు కు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. అంతకు మునుపు కొత్త బస్సుకు ఎమ్మెల్యే ఆది మూలం పూజలు నిర్వహించి కొబ్బరికాయ కొట్టారు.అనంతరం గుమ్మడికాయతో దిష్టి తీయించిన తర్వాత ఎమ్మెల్యే ఆదిమూలం పలువురు టిడిపి నేతలు,అధికారులతో కలిసి ఆర్టీసీ బస్సు ఎక్కి టికెట్ తీసుకొని కొంత దూరం ప్రయాణించారు.ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాల్సిన బాధ్యత ఆర్టీసీపై ఉందన్నారు. ప్రతిరూట్లో నిర్దేశించిన సమ యానికి బస్సులను నడపడానికి ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైవర్ లేదని,కండక్టర్ లేదని బస్సులను అద్దాంతరంగా ఆపే సంస్కృతికి స్వస్తి పలకాలని ఆయన ఆర్టీసీ అధికారులను కోరారు. ప్రత్యామ్మాయ మార్గాల ద్వారా ఆర్టీసీ బస్సులను నడిపి ప్రయాణికుల మన్ననలు పొందాలన్నారు.ఈ కార్యక్రమం లో సిఐ మురళి,ఎస్సై రామస్వామి,ఎంపీ డీవో చంద్రశేఖర్,ఎంఈఓ రవి,టిడిపి మాజీ మండలాధ్యక్షుడు పరమశివం, మురళి (చికెన్ చిన్న),పిఎస్ఆర్ సుబ్రమణ్యం, శశి మోహన్నాయుడు,ప్రభాకర్ రెడ్డి, జక్కల శివానందం,గణేష్,రాధాకృష్ణ,జనసేన మండలాధ్యక్షుడు రూపేష్ కుమార్,ఆర్టీసీ యూనియన్ నాయకులు పలువురు పాల్గొన్నారు.

## ప్రపంచ శాంతి కోసం జన్మించిన కరుణామయుడు ఏసుప్రభు
### ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి



ఎస్ ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 21: గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎస్ఆర్ పురం మండలం 49 కొత్త పల్లి మిట్ట సిఎస్ఐ చర్చిలో వైఎస్ ఆర్సిపి యువ నాయకుడు సాము ఆధ్వర్యంలో ఈస్టర్ పండుగ ఘనం గా నిర్వహించారు.ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి పాల్గొ న్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ... ప్రపంచ శాంతి కోసం దైవ దూతగా జన్మించి ప్రపంచంలో శాంతి నెలకొల్పిన మహనీయుడు, కరుణామయుడు ఏసు ప్రభు అని అన్నారు.ఆయన అడుగుజాడ ల్లో ప్రతి ఒక్కరు నడవాలని సూచించారు. ప్రతి కార్యకర్త, నాయకుడికి నేను అండగా ఉంటా ఎవరు ఆధర్య పడకండి అని అన్నారు.ఇదే ఉత్సాహంతో రానున్న రోజుల్లో అధికార పార్టీ చేసే దౌర్జన్యం అరాచకం అన్యాయాన్ని ప్రశ్నించాలని కార్యకర్తలకు నాయకులకు సూచించారు. మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామికి వైసీపీ నాయకులకు వైసీపీ యువ నాయ కుడు సాము విందు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి మండల కన్వీనర్ మణి, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు గురువారెడ్డి, పెట్రోల్ బంక్ యజమాని గోపి జనార్ధన్, చిత్తూరు జిల్లా క్రియాశీలక కార్యదర్శి విజ యబాబు,కుప్పయ్య,గంగాధర్ నెల్లూరు మండల కన్వీనర్ వెంకట రామిరెడ్డి,కో ఆప్షన్ నెంబర్ యేసయ్య,కోటిరెడ్డి బాబు, సుధా,స్కైలా,గంగాధర్ నెల్లూరు మాజీ సొసైటీ అధ్యక్షులు వేల్కూరు బాబు రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామయ్య,నల్ల వెంగనపల్లి సర్పంచ్ శివాజీ,నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# తండ్రికి తగ్గ తనయుడు డాక్టర్ రాహుల్
## యువత అడుగులు డాక్టర్ రాహుల్ వైపు




గంగాధర నెల్లూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 21: గంగాధర నెల్లూరు నియోజకవర్గం యువత రాహుల్ వైపు ముందడుగులు వేస్తున్నారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో యువతకు క్రికెట్ టోర్నమెంట్ వాలీబాల్ టోర్నమెంట్ కార్యక్రమాలకు డాక్టర్ రాహుల్ ముందుకు రావడంతో రాహుల్ సేవలను యువత ఆకట్టుకుంటున్నాయి. పెనుమూరు మండలం ఊప్పిలి పల్లి గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన సందర్భంగా వన్డే వాలీబాల్ టోర్నమెంట్ నో నిర్వహించగా ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ జీడీ నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ తనయుడు డాక్టర్ రాహుల్ రావడంతో యువత కేరింతలు ఉత్సాహంతో పూలవర్షం తో స్వాగతం పలికారు అలాగే ఉప్పిలిపల్లి గ్రామస్తులు డాక్టర్ రాహుల్ పలకరించారు ఎలా ఉన్నారు మీ గ్రామానికి ఏమైనా అవసరమా మీకు ఏదైనా అవసర మా గ్రామస్తులతో మమేకమవ డంతో యువతకు గ్రామస్తులకు మరింత సంతో షాన్నిచ్చింది.ఇలా మంచి కార్యక్రమండాక్టర్ రాహుల్ ఎంచుకున్నందుకు గ్రామాల్లో గ్రామస్తులు యువతకు మంచి మార్పు కని పిస్తున్నది దీనితోపాటు మీడియా కోఆర్డి నేటర్ పిఆర్ఓ బాబు డాక్టర్ రాహుల్ కు మంచి సలహాలు సూచనలు ఇవ్వడంతో యువత డాక్టర్ రాహుల్ ను ఆకట్టుకున్నా యి తండ్రికి తగ్గ తనయుడు అని గ్రామాల్లో ఉత్సాహం నింపింది.వన్డే వాలీబాల్ టోర్న మెంట్ ఆర్గనైజింగ్ మీడియా కోఆర్డినేటర్ బాబు ఎన్ఎస్ రాజు పవన్ చిరంజీవి ఆర్గనైజింగ్ చాలా బాగుంటుంది సార్.

## క్రమశిక్షణతో చదువుకుంటే విద్యార్థి జీవితం.....
# ఓ కొత్త బంగారులోకం... సాఫ్ట్వేర్ బాలు



బసిరెడ్డిపల్లి ప్రధానోపాధ్యాయులు ప్రసన్న టిడిపి యువ నాయకుడు రాజు గల్లా విద్యార్థుల తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 21:విద్యార్థుల క్రమశిక్షణ చదువుకుంటే వారి జీవితం ఓ కొత్త బంగారులోకంలా ఉంటుం దని టిడిపి యువ నాయకుడు సాఫ్ట్వేర్ బాలు అన్నారు సోమవారం ఎస్ఆర్ పురం మండలం 50 బసిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠ శాలలో పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు అలాగే పాఠశాలలో చదివే విద్యార్థులకు సాఫ్ట్వేర్ బాలు నోటు పుస్త కాలు బోధన సామాగ్రి అందించారు.ఈ సందర్భంగా సాఫ్ట్వేర్ బాలు మాట్లాడుతూ వేసవికాలంలో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలి అలాగే వేసవిలో ఎండలు ఎక్కువ గా ఉండటం విద్యార్థులు తగిన జాగ్రత్త తీసుకోవాలని తెలియజేశారు అలాగే వేస వికాలం సెలవుల్లో చెరువుల దగ్గరకు కుంటలు బావి దగ్గరకు వెళ్ళకూడదని విద్యార్థులకు తెలియజేశారు.విద్యార్థు లందరూ బాగా చదువుకొని ఉన్న స్థితికి ఎదగాలని విద్యార్థులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 సబర్మతి ఆరి మకులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్

## పలమనేరు గోపి దాబా వద్ద.....
## తమిళనాడు బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు స్పాట్లో మృతి



పలమనేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 21: చిత్తూరు జిల్లా పలమనేరు పట్టణం బెంగళూరు – చెన్నై జాతీయ రహదారిపై వాహన ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు సోమవారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో తెలిపిన సమాచారం మేరకు, నాగమంగళం మదర్సా లో పనిచేస్తున్న సుహేల్ ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తుండగా తమిళనాడుకు చెందిన బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని పలమనేరు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కొరకు తరలించారు దర్యాప్తు చేసి పూర్తి వివరాలు తెలుపుతామన్నారు. వట్టణం బెంగళూరు - చెన్నై జాతీయ రహదారిపై వాహన ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు సోమవారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో తెలిపిన సమాచారం మేరకు, నాగమంగళం మదర్సా లో పనిచేస్తున్న సుహేల్ ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తుండగా తమిళనాడుకు చెందిన బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని పలమనేరు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కొరకు తరలించారు దర్యాప్తు చేసి పూర్తి వివరాలు తెలుపుతామన్నారు.

### ఘనంగా రాష్ట్ర ముఖ్యమంత్రి....
## నారా చంద్రబాబు నాయుడు
## జన్మదిన వేడుకలు



వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 21: వెదురుకుప్పం మండలం చవటగుంట గ్రామం కూడలి నందు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన సందర్భంగా చంద్రబాబు నాయుడు గారి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, అన్నదాన కార్యక్రమం చేసి, కేక్ కట్ చేసి చంద్రబాబు నాయుడు కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్ మరియు జి డి నెల్లూరు శాసనసభ్యులు (ఎమ్మెల్యే) డాక్టర్ బి.ఎం థామస్ టిడిపి నాయకులు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


## ప్రధానోపాధ్యాయులు సిద్దయ్యను ....
## సత్కరిస్తున్న టిడిపి నాయకులు



వెదురుకుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 21: పచ్చికాపల్లం హైస్కూల్ ప్లస్ ప్రిన్సిపాల్ మరియు ప్రధాన ఉపాధ్యాయులు పోతుగంటి సిద్దయ్య రిటైర్మెంట్ కార్యక్రమంలో సిద్దయ్య గారిని సత్కరిస్తున్న వెదురుకుప్పం క్లస్టర్ ఇంచార్జ్, టిడిపి మాజీ మండల అధ్యక్షులు మాజీ ఎంపీటీసీ మోహన్ మురళి, మాజీ సర్పంచ్ రాజారెడ్డి, పచ్చికాపల్లం హైస్కూల్ చైర్మన్ చంగలరాయులు, టిడిపి మండల ఎస్సీ అధ్యక్షులు వరప్రసాద్,చెంచుగుడి బూత్ కన్వీనర్ చిరంజీవినాయుడు, తిరుమలయ్యపల్లి బూత్ కన్వీనర్ శంకరయ్య,విక్రమ్ రెడ్డి, మారేపల్లి సర్పంచ్ అన్బు రాశి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువత జీవితాల్లో ....
## వెలుగులు నింపే కూటమి ప్రభుత్వం....

### మెగా డిఎస్సి నోటిఫికేషన్ విడుదలే దీనికి నిదర్శనం..
### మాట నిలబెట్టుకున్న ఏపి.సియం చంద్రబాబు
### చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు



చిత్తూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 21: 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడిన కూటమి ప్రభుత్వం.., మెగా డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేసి.., నిరుద్యోగ యువత జీవితాల్లో వెలుగులు నింపేందుకు సిద్ధమైందనీ..ఇది రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమర్థవంతమైన పాలనకు నిదర్శనమని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ఓ ప్రకటనలో కొనియాడారు.ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు సందర్భంగా.. కూటమి ప్రభుత్వం మెగా డిఎస్సి నోటిఫికేషన్ను విడుదల చేసింది.ఈ నేపథ్యంలో ఇచ్చిన హామీనునిలబెట్టుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధిని సోమవారం చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు సోమవారం ఓ ప్రకటనలో అభినందినలు తెలియజేశారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని రకాల అభివృద్ధి పథంలో నడిపేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషి ఎనలేనిది అన్నారు. మరీ ముఖ్యంగా నిరుపేదలు లేని సమాజ స్థాపనే ఆయన లక్ష్యమని చెప్పారు. అదేసమయంలో నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందు కు చర్యలు చేపట్టి..,తాజాగా మెగా డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేసి..,16347 ఉపా ద్యాయ ఉద్యోగాల భర్తీకి కంకణం కట్టుకో వడం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పరిపాలనా దక్షతకు నిలువెత్తు నిదర్శనం అని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గు మళ్ళ ప్రసాదరావు ప్రశంసించారు. ఇకపోతే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.., విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు.. ఇందులో కీలక పాత్ర పోషించి.., రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించే దిశగా అడుగులు వేయడం శుభపరిణామమన్నా రాయన.2047 విజన్ తో ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వానికి ప్రజా దీవెనలు మెండుగా ఉన్నాయన్నారు.

## జనసేన ఇంచార్జి నరేష్ ఆధ్వర్యంలో .....
## వైఎస్ఆర్సిపి నుంచి జనసేన పార్టీలో చేరిక..

కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 21: పవన్ కళ్యాణ్ ఆశయాలను నాయక త్వాన్ని ఆకర్షితులై కుప్పం నియోజకవర్గం వైఎస్ఆర్సిపి కి చెందిన 15 మంది యువకు లు జనసేన పార్టీలో చేరారు,వారిని జనసేన పార్టీ కండువా కప్పి పార్టీలోకి కుప్పం జనసేన ఇన్చార్జి నరేష్ ఆహ్వా నించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్థానిక ఎన్ని కలు రానున్నడంతో కూటమి నాయకులకు మద్దతుగా పని చెయ్యాలని సూచిస్తూ జనసేన పార్టీని మరింత బలోపేతం చెయ్య డానికి ప్రతీ జనసైనికుడు కృషి చేయాలని నరేష్ తెలిపారు.



## కుప్పం మున్సిపాలిటీ 19 వార్డులో సమస్యల పరిష్కారానికి ...

### ప్రత్యేక చొరవ చూపుతున్న కౌన్సిలర్ జిందాము



కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 21: కుప్పం మునిసిపాలిటీ లోని 19 వార్డు లో సిమెంట్ రోడ్డు డ్యామేజ్యామేజ్ కావడంతో స్థానికులు వార్డు కౌన్సిలర్ దాము దృష్టికి తీసుకువచ్చారు.కౌన్సిలర్ దాము మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రావుతో సమస్యపైసమస్య పై చర్చించి పాడైన అయిన సిమెంట్ రోడ్డుకు సోమ వారం మరమ్మతు పనులు చేయించారు. వార్డులోని ప్రజల సమస్యలను ఎప్పటి కప్పుడు పరిష్కరించడం జరుగుతుందని దాము తెలియజేశారు.


## ద్రావిడ విశ్వవిద్యాలయంలో ..... సెమిస్టర్ పరీక్షల పరిశీలన



గుడిపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 21: కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండలంలోని ద్రావిడ యూనివర్సిటీలో ఏప్రిల్ 21 సోమవారం నుండి నిర్వహిస్తున్న యూజీ,పీజీ రెండో,నాల్గో సెమిస్టర్ పరీక్షల ను వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎం.దొరస్వామి పరిశీలించారు.పరీక్షలు రాస్తున్న విద్యార్థు లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సిబ్బందికి తెలియజేశారు.వీసీ, పలువురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

## ప్రతి సమస్యను పరిష్కరిస్తాము

### : వికాస్ మరమత్




కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 21: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా తమకు అందిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని కడా పిడి వికాస్ మరమత్ తెలిపారు. సోమవారం ఆయన కుప్పం పట్టణ పరిధిలోని మండల అభివృద్ధి కార్యాలయం సమావేశ మందిరం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ శాఖలకు సంబంధించి ప్రజల నుండి మొత్తం సమస్యలపై 25 వినతులు అందాయని తెలిపారు. వాటన్నింటినీ పరిశీలించి ఆయా శాఖల అధికారులకు కేటాయించామని, వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించి, త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

### పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ

# భూ సమస్యల పరిష్కారమే ప్రత్యేక అజెండా ముందుకు సాగుతున్నాం

## : జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

పలమనేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 21: భూ సమస్యల పరిష్కారమే ప్రత్యేక అజెండా ముందుకు వెళు తు న్నామని, పలమనేరు డివిజన్ పరిధిలో సమస్యల పరిష్కారానికి రానున్న మూడు నెలల పాటు ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమ నిర్వహణ ఉంటుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు.సోమవారం పలమనేరు ఆర్ డి ఓ కార్యాలయంలో పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధి లోని ప్రజల సమస్యల పరి ష్కారం నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్య క్రమం ఏర్పాటు చేసి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, పలమనేరు శాసన సభ్యులు ఎన్.అమర నాథ్ రెడ్డి,జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యా ధరి,డి ఆర్ ఓ కె.మోహన్ కుమార్ లులో ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి అందుతున్న వినతులలో దాదాపు 95 శాతం రెవెన్యూ సమస్యలకు సంబంధించినవే ఉన్నాయన్నారు. ఇందు లో డికెటి, కుటుంబ తగాదాలు,ఆర్ ఓ ఆర్,ఆన్ లైన్ రికార్డులలో సమస్యలు ఉన్నాయని,ఈ సమస్యల పరిష్కారానికి తహశీల్దార్లకు ఆదేశాలు ఇవ్వడం జరిగిం దని, క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యల ను పరిష్కరిస్తామన్నారు. న్యాయపరమైన చిక్కులు, కుటుంబ తగాదాల నేపథ్యంలో వినతుల పరిష్కారం ఆలస్యం అగుచున్న దన్నారు.రానున్న మూడు నెలలు పలమ నేరు, పుంగనూరు నియోజకవర్గంలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ముఖ్యంగా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చూపడం జరుగు తుందన్నారు. వినతుల పరిష్కారానికి అధికారులకు సరిపడా సమయం ఇస్తు న్నామని,నాణ్యమైన పరిష్కారం చూపు తామన్నారు. పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల నుండి జిల్లా కేంద్రంకు వచ్చి సమస్యలను విన్నవించడానికి ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఇదొక సదవకాశమని పేర్కొన్నారు. జిల్లాలలో పి జి ఆర్ ఎస్ ద్వారా 53 వేల వినతులు అందగా అందులో 12 వేల అర్జీలు కుప్పం నియోజకవర్గం నుండి అందాయని, క్రమం గా కుప్పంలో పర్యటించి సాధ్యమైనంత సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. అదే తరహాలో మిగిలిన నియోజకవర్గ పరి ధిలో సమస్యల పరిష్కారం పై దృష్టి పెట్టా మన్నారు.పలమనేరు ఎం ఎల్ ఏ మాట్లా డుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమ నిర్వహణ పూర్తిగా ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలో చన అని,గతంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా ఇదే విధంగా అధికార యంత్రాంగాన్ని ప్రజల దగ్గరకు పంపి వారి సమస్యలకు పరిష్కార మార్గం చూపేలా చర్యలు తీసుకున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంలో ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నది ముఖ్యమంత్రి ఉద్దేశ్యం అన్నారు.



పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పలమనేరు, పుంగనూ రు నియోజకవర్గాలలో గల ప్రజల సమస్య లను స్వీకరించడం జరిగిందన్నారు. పుంగ నూరు లో గతంలో జమీందారీ వ్యవస్థ ఉండడం, పలమనేరు లో కొన్ని ప్రత్యేక పరిస్థితుల కారణంగా రెవెన్యూ సమస్యలు ఉత్పన్నమయ్యాయని,జిల్లా కలెక్టర్ ,జిల్లా జాయింట్ కలెక్టర్ల ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా సమస్యల పరిష్కారానికి శ్రీకా రం చుట్టామన్నారు. పలమనేరు డివిజన్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పలమనేరు డివి జన్ కేంద్రంలో రానున్న మూడు నెలల పాటు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు హాజరవుతారన్నారు. ఈ సదవకాశాన్ని పలమనేరు డివిజన్ ప్రజానీకం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# డీసీసీబీ ఛైర్మన్ గిరి కోసం ఎందుకంత పోటీ

కాకినాడ : ఏటా రూ. 10వేల కోట్ల టర్నోవర్స్.. మూడు జిల్లాలుకు సంబంధించి రైతాగం.. 298 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు.. ఇవన్నీ కలిస్తే కాకినాడ జిల్లా కో ఆపరేటివ్ బ్యాంకు.. ఇంతటి ప్రాధాన్యత కలిగిన డీసీసీబీ ఛైర్మన్ పదవి అంటే ఎవరికి కాంక్ష ఉండదు.. అందుకే ఇప్పుడు ఈ పదవికి పోటీ తీవ్రమయ్యింది.. అధ్యక్ష పదవి కోసం హోరాహోరీ మొదలైంది. అయితే ఈ సారి సొసైటీలకు, బ్యాంక్ డైరెక్టర్ పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు జరపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలో ఉన్నారని తెలుస్తోండగా ఈ పదవి ఎవరిని వరిస్తుందోనన్న ఉత్కంఠ వీడడం లేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వ్యవసాయంపై ఆధారపడ్డ రైతులు వేలాది మంది ఉంటారు. వీరి కార్యకలాపాలన్నీ గ్రామాల్లో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలతో ముడిపడి ఉండగా వ్యవసాయ రుణాల నుంచి ఇతర అవసరాలన్నీ ప్రాథమిక సహకార సంఘాలే తీరుస్తాయి.. అయితే వీటన్నిటిపైనా కీలకంగా పర్యవేక్షణచేసే డీసీసీబీ ఏటా రూ.10 వేల కోట్ల వరకు టర్నోవర్ సాధిస్తోంది.. ఉమ్మడి తూర్పోగోదావరి జిల్లాలో 298 పీఏసీఎస్‌లు ఉండగా ఇందులో తూర్పుగోదావరి 49, కాకినాడ 72, అత్యధికంగా కోనసీమ జిల్లాలో 166 పీఏసీఎస్‌లు ఉండగా అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించి 11 పీఏసీఎస్‌లు ఉండడం ఇందులో కలిసే ఉన్నాయి. వాస్తవానికి డీసీసీబీ ఇంకా మంచి ప్రగతి పథంలో దూసుకుపోవాల్సిన పరిస్థితి ఉండగా అవినీతి ఆరోపణలు, అనేక పెండింగ్ సమస్యలు వెనక్కు లాగే పరిస్థితి కనిపిస్తోంది.. దీర్ఘకాలంగా సభ్యత్వ రుసుంల నుంచి పలు అంశాలు పెండింగ్లో ఉన్నాయి. 2018తర్వాత ఇప్పటివరకు సొసైటీలకు, బ్యాంక్ డైరెక్టర్ పదవులకు ఎన్నికలు జరపలేదు. దీంతో సభ్యత్వ నమోదు పునరుద్ధరణతో పాటు మార్పులు, చేర్పులు, తుది జాబితాల వెల్లడి, ఇలా కనీసం ఏడాది పాటైనా బ్యాంక్, సొసైటీల ఎన్నికలకు సమయం కావాలి. దీంతో మరోసారి సొసైటీలు, బ్యాంక్ పాలకవర్గాలను నామినేటెట్ విధానంలోనే నియమించక తప్పని పరిస్థితి ప్రభుత్వానికేర్పడింది. దీన్ని గుర్తించి రాష్ట్రంలో అతిపెద్దదైన ఉమ్మడి తూర్పు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్ష పదవితో పాటు డైరెక్టర్ల పదవుల కోసం మూడు పార్టీల్లో హేమాహేమీలంతా ప్రయత్నాలు ప్రారంభించారు.జిల్లా సహకార బ్యాంక్ ఛైర్మన్ కోసం ఎందుకంత పోటీ అనే అంశంపై అనేక విమర్శలు ఎదురవుతున్నాయి.. ఈ పదవి పొందేందుకు ఎందకంత పోటీ అంటే గతంలో అవినీతికి పాల్పడ్డవారు కోట్లకు పడగలెత్తారన్న ఆరోపణలున్నాయి.. ఈ పదవి చేసిన వారిలో అత్యధికులు దోపిడీదార్లుగా ముద్రపడ్డారు. ఆకాశం శ్రీరామచంద్రమూర్తి, శిరంగు కుక్కుటేశ్వరరావు వంటి ముగ్గురు నలుగురు తప్ప గతకొంతకాలంగా వరుసగా ఈ పదవిని అధిష్టిస్తున్న ప్రతి ఒక్కరు వందల కోట్ల కుంభకోణాల్లో ఇరుక్కున్నారు. వరుపుల సుబ్బారావు హయాంలో శక్తి గ్యాస్ అంటూ బ్యాంక్ను పక్కదారి పట్టించారు. పంతం గాంధీమోహన్ హాయంలో వంద ల కోట్ల ఆరోపణలొచ్చాయి.ఇక వరుపుల రాజా అయితే లెక్కలేని కుంభకోణాలకు పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి. ఆయన ప్రాతినిధ్యం వహించిన లంపకలోవ సొసైటీలో భారీ ఆర్థిక కుంభకోణాలున్నట్లు విచారణాధికారి తేల్చేశారు. ఈ ఆర్థికనేరాల ఒత్తిళ్ళ కారణంగానే రాజా ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. ఇప్పటికే ఈ బ్యాంక్ ఛైర్మన్ పదవి అంటే వందల కోట్ల దోపిడీకి జాతీయ రహదారిగా రాజకీయాల్లో పేరుపడింది. ఈదశలో గతంలో ఆరోపణలెదుర్కొన్న వ్యక్తులకే ఈ పదవి కట్టబెట్టాలన్న ఆలోచన విమర్శలకు తావిస్తోంది. పలువురు ఎమ్మెల్యేల సిఫార్సుపొందిన పిల్లి సత్తిబాబుపై గతంలో తీవ్రమైన ఆర్థిక ఆరోపణలొచ్చాయి. కాకినాడ డీసీసీబీ ఛైర్మన్ గిరీ కోసం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పోటాపోటీగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. జిల్లా స్థాయి పదవి కావడంతో పాటు ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైన ఛైర్మన్ గిరిని తామే దక్కించుకోవాలని తెలుగుదేశం పార్టీ గట్టిపట్టుదలతో ఉంది. ఇప్పటికే ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు పలువురు ఛైర్మన్ గిరి కోసం సిఫార్సులు కూడా ప్రారంభించారు. ఎమ్మెల్యే టికెట్ పొందలేక పోయిన కొందరు సీనియర్లు తమకీ పదవివ్వాలంటూ అధిష్టానాన్ని అభ్యర్థిస్తున్నారు. తమకు తెలిసిన మంత్రుల ద్వారా చంద్రబాబుకు చెప్పిస్తున్నారు. ఇదిలా ఉంటే జనసేన జిల్లా సహకార బ్యాంక్ ను తమ అధీనంలోకి తెచ్చుకోవాలన్న పట్టుదల ప్రదర్శిస్తోంది.. ఆ పార్టీ కాకినాడ జిల్లాలో ఆధిపత్యంలోనే కొనసాగుతోంది. పిఠాపురం, కాకినాడ రూరల్‌తోపాటు కాకినాడ పార్లమెంటు స్థానంలో పట్టునిలుపుకున్న జనసేన ఇప్పుడు అధినేత పవన్ కళ్యాణ్ చొరవ ద్వారా డీసీసీబీ పీఠం దక్కించుకునేందుకు పావులు కదుపుతోంది.కోనసీమ జిల్లాలో అత్యధికంగా పీఏసీఎస్‌లు ఉండడం వల్ల కోనసీమ ప్రాంతానికి చెందిన మెట్ల రమణబాబు కూడా రేసులో ఉన్నారు. దివంగత మంత్రి మెట్ల సత్యనారాయణ కుమారుడు అయిన రమణబాబు గట్టిగానే ప్రయత్నిస్తున్నారు.. దివంగత మెట్ల సత్యనారాయణ ఎన్టీఆర్, చంద్రబాబుల హయాంలో పని చేశారు.


# ఎమ్మెల్సీ అనంతబాబుకు ఉచ్చు



కాకినాడ : తన దగ్గర కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న దళిత కారు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం ను హత్య చేసి ఆపై డోర్ డెలివరీ చేసిన సంఘటన పై ఏపీ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది.. దీనిపై తమకు ఇంకా సరైన న్యాయం జరగలేదంటూ మృతుడి కుటుంబికులు ఎన్నికలకు ముందు చంద్రబాబును కలిసి విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దీనిపై న్యాయ విచారణ చేపట్టి న్యాయం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు ఏపీ ప్రభుత్వం ఈ సంఘటనపై న్యాయ విచారణకు ఆదేశించింది.. కాకినాడకు చెందిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం రంపచోడవరంకు చెందిన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు దగ్గర కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు.. చాలా కాలంగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం మానేశాడు.. ఇదిలా ఉంటే 2022 మే 19న ఇంటి నుంచి వెళ్లిన సుబ్రహ్మణ్యం తిరిగి రాలేదు. అయితే తెల్లవారు జామున ఓ కారులో గుర్తు తెలియని వ్యక్తి సుబ్రహ్మణ్యం మృతదేహం తీసుకొచ్చి వదిలి వెళ్లిపోయాడు. ఈ సంఘటన అప్పట్లో తీవ్ర సంచలనం రేకెత్తించింది. దళిత సంఘాలు పెద్ద ఎత్తున నిరసనకు దిగాయి.. అయితే వైసీపీ ప్రభుత్వం నిందితున్ని కాపాడుతోందని ఆరోపణలు కూడా వెల్లువెత్తాయి.. ఈక్రమంలోనే అత్యంత దారుణంగా హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంత బాబు పై కాకినాడ జిల్లా పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే అప్పట్లో పోలీసుల వైఖరిపై తీవ్రస్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. ఎట్టకేలకు ఎమ్మెల్సీ అనంతబాబును అరెస్ట్‌చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు పోలీసులు.. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన వైసీపీ ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ అలియాస్ అనంత బాబు డోర్ డెలివరీ కేసులో న్యాయ విచారణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ న్యాయ విచారణలో ప్రాసిక్యూషన్ కు సహాయం చేయడానికి ప్రత్యేక న్యాయవాదిగా ప్రముఖ సీనియర్ న్యాయవాది, ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ మెంబర్ మరియు మానవ హక్కుల రక్షణ కోసం సుదీర్ఘంగా పోరాటం చేస్తున్న ముప్పాళ్ళ సుబ్బారావును నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 538 ని విడుదల చేసింది. దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం కుటుంబానికి ముప్పాళ్ళ సుబ్బారావు అండగా నిలిచారు. వీధి సుబ్రహ్మణ్యం కుటుంబానికి న్యాయస్థానాల్లో పోరాటం చేసేందుకు నేనున్నానంటూ నిలబడ్డారు. ముప్పాళ్ళ సుబ్బారావు మడమతిప్పని పోరాటం వల్ల ఎమ్మెల్సీ అనంత బాబుకు స్థానిక న్యాయస్థానాల్లో బెయిల్ లభించలేదు. చివరికి సుప్రీంకోర్టు వరకు వెళ్లాల్సి వచ్చింది. ప్రస్తుతం అనంత బాబు బెయిల్ పై ఉన్నారు. దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితులు తప్పించుకునే విధంగా పోలీసులు చార్జిషీట్ రూపకల్పన చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.. హత్య సంఘటన అనంతరం 88 రోజులకు దాఖలు చేసిన చార్జిషీట్‌ను అప్పట్లో న్యాయ స్థానం తిరస్కరించింది. అందులో సాంకేతి ఆధారాలు, నిందితుల కదలికలు తదితర అంశాలు లేకుండా చార్జిషీట్‌లో లేకపోవడమే తిరస్కరణకు కారణమని బాధితుల తరపున వాదించిన న్యాయవాది సుబ్బారావు వెల్లడించారు. 2023 ఏ?రపిల్ 14న అనుబంధ చార్జిషీట్‌ను వేశారు. గడువులో దాఖలు చేయకుండా నిందితుడుకు బెయిల్ వచ్చేవిధంగా అప్పటి ఎస్పీ, డీఎస్పీ ఆలస్యం చేశారని విమర్శలున్నాయి.. అప్పట్లో తానే హత్యచేశానని విచారణలో ఎమ్మెల్సీ అనంతబాబు అంగీకరించినట్లు మీడియా సమావేశంలో ఎస్పీ వెల్లడించారు కూడా.. చార్జిషీట్ ఆలస్యం వల్లనే మధ్యంతర బెయిల్ వచ్చిందని దళిత సంఘాలు ఆరోపిస్తున్నాయి. అయితే మృతుడి తల్లితండ్రులు నూకాలమ్మ,సత్యనారాయణలు మాత్రం మూడేళ్లుగా న్యాయపోరాటం చేస్తున్నారు. ఈ కేసును రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బాధితులకు న్యాయం జరిగేలా విచారణకు ఆదేశిస్తారని భావిస్తూ వచ్చారు. సరిగ్గా ఇప్పుడు అదే జరిగింది. తీవ్ర సంచలనం సృష్టించిన ఈ కేసులో ప్రత్యేక కౌన్సిల్ ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒక న్యాయవాదిగా మంచి ట్రాక్ రికార్డు కలిగిన ముప్పాళ్ళ సుబ్బారావును ఈ కేసులో సహాయం చేయడానికి ప్రత్యేక న్యాయవాదిగా నియమించడం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం అవుతోంది. ఎమ్మెల్సీ అనంత బాబు కేసులో న్యాయం గెలుస్తుందన్న నమ్మకం ఇప్పుడు వీధి సుబ్రహ్మణ్యం కుటుంబంతో పాటు దళితుల్లోనూ కలుగుతోందంటున్నారు..

# పెద్దిరెడ్డికి టీడీపీ నేతల అండలు...?

తిరుపతి : ఏంటో వీళ్లు పట్టించుకోవడం లేదా.. లేక చేతకావడం లేదా.. లేక క్యాష్ కొట్టినోడిని క్షమించేస్తున్నారా.. ఇదే కూటమి ప్రభుత్వంపై ఆ పార్టీల కార్యకర్తలే విసురుతున్న మాటలు. మొదటి ఆరు నెలలు అయితే ఏకిపారేశారు. తర్వాత కాస్త కేసులు ఒక్కోరిపై పెడుతున్న కొద్దీ .. కొంచెం కొంచెం చల్లబడ్డారు. కాని ఆ కేసులు నడుస్తున్న తీరు చూసి మళ్లీ ఫైరవుతున్నారు. అదేమంటే టీడీపీ నేతలేమో మేం పద్ధతిగా వెళు తున్నాం.. వైసీపీలాగా అరాచకంగా, కక్షగట్టి చేయం అంటూ సుభాషితాలు చెబుతున్నారు. లేటెస్టుగా పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి వ్యవహారంలో ప్రభుత్వంపై ఇలాంటి విమర్శలే వస్తున్నాయి.హైకోర్టు ముందస్తు బెయిల్ ఇస్తే.. సుప్రీంకోర్టులో కేవియెట్ ఎందుకు వేయలేదని.. అసలు బెయిల్ ఇచ్చే సమయంలో ప్రభుత్వం తరపు లాయర్ సరిగా వ్యవహరించలేదని.. సోషల్ మీడియాలో కూటమి కార్యకర్తల మధ్యే పెద్ద వార్ నడుస్తుంది. సమర్థించుకునేవారు కొందరు.. ప్రశ్నించేవారు మరికొందరు.. మొత్తం మీద రచ్చ నడుస్తోంది. ఇప్పుడు మిథున్ రెడ్డి లిక్కర్ స్కామ్ కేసులో విచారణకు హాజరవుతున్నారు. తన విచారణను లాయర్ల సమక్షంలో చేయాలని.. వీడియో రికార్డింగ్ చేయించాలని హైకోర్టులో పిటిషన్ వేశారు మిథున్ రెడ్డి. దీనిపై కూడా ప్రభుత్వం తరపు లాయర్లు సరిగా వాదించలేదనేదే విమర్శ. అసలు పెద్దిరెడ్డి ఫ్యామిలీతో కుమ్మక్కయ్యారా అంటూ సోషల్ మీడియాలో సర్క్యులేషన్ నడుస్తోంది.ఇక్కడ సమస్య ఏంటంటే? కేసులు ఎదుర్కొంటున్న వైసీపీ పార్టీ నేతలంతా క్యాష్ పార్టీలే. మామూలు క్యాష్ పార్టీలు కాదు? ఎవరిని కొట్టాలన్నా క్యాష్ తోనే కొట్టే బ్యాచ్. క్యాష్ కొడితే దెబ్బ తగిలినా నవ్వుతూ తీసుకునే బాపతు మన వ్యవస్థలో చాలా ఎక్కువ మంది ఉన్నారు. పోలీసులు, లాయర్లు, అధికారులు.. అన్ని చోట్లా ఈ కల్చర్ ఉంది. బోరుగడ్డ అనిల్ విషయంలో అదే జరిగింది. పోలీసులు డబ్బులు తీసుకుని వాడికి రాచమర్యాదలు చేశారు.. ఆ వీడియోలు బయటకు రావడంతో జాగ్రత్తపడ్డారు. ఆఖరికి బోరుగడ్డ బెయిల్ కోసం పెట్టిన పేపర్లు కూడా ఫేక్ అని హైకోర్టు తేల్చింది కాని.. పోలీసులు కాదు.అంతెందుకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై భూకబ్జా ఆరోపణలు ఎన్ని వచ్చాయి? అటవీ భూములు, అసైన్డ్ భూములు ఆక్రమించినట్లు కంప్లయింట్లు చాలామంది చేశారు. మదనపల్లి తహశీల్దార్ ఆఫీసులో అగ్ని ప్రమాదం జరిగితే హెలికాప్టర్ లో అధికారులను పంపిన ప్రభుత్వం.. తర్వాత మాత్రం దాని గురించి పెద్దగా పట్టించుకున్నది. నెలల తర్వాత పెద్దిరెడ్డికి నోటీసులు ఇవ్వడానికి వెళ్లారు.. ఆయన లేరని వెనక్కి వచ్చేశారు. అలా నడుస్తోంది వ్యవహారం. అసలు భూములు ఆ రేంజులో కొట్టేసిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని.. అది కూడా ఆయన భార్య పేరు మీద డాక్యుమెంట్లు దొరికాక కూడా .. ఆయనను టచ్ చేయకపోవడం ఎలాంటి సిగ్నల్స్ ఇస్తుందని కొందరు ప్రశ్నిస్తున్నారుపెద్దిరెడ్డి కుటుంబం వరకు టీడీపీలోనే ఓ పెద్ద ఫ్రెండ్ ఉన్నాడన్నది చాలామందికి తెలుసు. ఆయనో టీడీపీ అనుకూల మీడియా అధినేత. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే ఆయన చానెల్ లో పెద్దిరెడ్డిపై ఈగ వాలనివ్వలేదు. ఇక కూటమి వచ్చాక ఆయనను కాపాడే లాబీయింగ్ నడిపించారని ప్రచారం జరుగుతోంది. అయితే మరో పెద్ద టీడీపీ అనుకూల మీఢియా ఈ విషయం తెలిసి? పెద్దిరెడ్డిని టార్గెట్ చేసి వార్తలు వరుసగా ఇచ్చింది. దీంతో అందరూ అది ఇవ్వక తప్పలేదు.. ప్రభుత్వం, అధికారులు స్పందించక తప్పలేదు. కాని పెద్దిరెడ్డి ఫ్రెండ్ లాబీయింగ్ గట్టిగానే పని చేస్తున్నట్లు ఉంది. అందుకే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని టచ్ చేయడం ఇంకా లేటు అవుతుంది.ఎందుకంటే ఈ స్కామ్ లో జగన్ ను అరెస్ట్ చేయడమే కూటమి ప్రభుత్వ టార్గెట్. అందుకే అలా జరుగుతోంది. లేదంటే మిథున్ రెడ్డిని కూడా పెద్దాయన రామచంద్రారెడ్డి కోరిక మేరకు వదిలేసేవారేమో. ఏమైనా క్యాష్ కొడితే ఎలాంటివాడినైనా వదిలేస్తారు అనే నానుడి మాత్రం కూటమి ప్రభుత్వంలో గట్టిగా వినిపిస్తోంది.



కాకపోతే క్రిమినల్ కేసులు మాత్రమే దానికి మినహాయింపు. అందులోనూ కొందరు నేతలకు మాత్రమే ఆ మినహాయింపు. మరి తప్పు చేసిన వైసీపీ నేతలకు శిక్షలు వేయించి తన ప్రాతివత్యం టీడీపీ నిరూపించుకుంటుందో లేదో చూడాలి మరి

OWNER AND PUBLISHED BY DAMA VIJAYAKUMAR, PRINTED AT VIJAY PUBLISHERS AND PRINTERS
D.No. 1-176, ANJUR Village & Post, K.V.B.PURAM Mandal, PIN:517643, Thirupati District A.P. Mobile: 9440352036